క్లుప్తంగా

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం



దేవరకద్ర: అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైల్వే స్టేషన్ 14 వ వార్డులో శనివారం ప్రారంభించారు. సర్పంచ్ విజయలక్ష్మి ఈ సందర్భంగా పూజలు చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వల్ల మురుగు నీటి ప్రవాహం బయటకు కనిపించదని, దోమలు బెడద తప్పుతుందన్నారు. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలవని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో సీపీఎస్ రద్దు చేయాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ పాల్గొన్నారు.

చిన్నచింతకుంట ఎస్‌ఐగా ఆర్ శేఖర్

చిన్నచింతకుంట: మండలం నూతన ఎస్సైగా ఆర్ శేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జోగుళాంబగద్వాల మల్దకల్ మండలంలో విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. చిన్నచింతకుంటలో విధులు నిర్వహించిన మోహన్ బాబు మహబూబ్‌నగర్ వీఆర్‌గా బదిలీ అయ్యారు.

సన్మానం

మిడ్జిల్: మండల కేంద్రంలో ఏఎస్‌ఐగా విధులు నిర్వహించిన ఖాద్రీకి ఇటీవల ఎస్‌ఐగా ప్రమోషన్ లభించింది. దీంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో గ్రామస్తులు ఆయనను సన్మానించారు. ఎస్‌ఐ రామ్‌లాల్ నాయక్, గ్రామ పెద్దలు వెంకట్‌రెడ్డి, సురేష్, గోపాల్, మల్లయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



మిడ్జిల్: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజారి సంతోష్, శ్రీనివాసులు, రవీంద్ర, వెంకటయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు అండగా ఉంటా'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆపదలో ఉన్న పేదలందరికీ అన్నివేళలా అండగా ఉంటూ వారిని తన కుటుంబ సభ్యుల్లా చూసుకుంటానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొంది బిల్లులు చెల్లించి ఇంటికి చేరిన 36 మందికి వారి ఆస్పత్రి ఖర్చులకు సంబంధించి రూ. 19.20 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం తమ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో మంత్రి అందజేశారు. ఇన్నాళ్లు అభివృద్ధి చేయని రాజకీయ పార్టీల నాయకులు కొందరు ఇప్పుడు కులం మతం పేరిట రాజకీయాలు చేసేందుకు వస్తున్నారన్నారు. డబ్బులతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. ప్రజలందరికీ అన్నివేళలా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేలా అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రినిను పాత కలెక్టరేట్ వద్ద శరవేగంగా నిర్మిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్ తదితరులుపాల్గొన్నారు.

10న సాయిచంద్ సంస్మరణసభ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10న టీఎన్‌జీఓ భవన్‌లో తెలంగాణ ఉద్యమ గొంతుక సాయిచంద్ సంస్మరణసభ నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌చందర్, తెలంగాణ లేబర్ సంఘం జిల్లా అధ్యక్షుడు శివన్న శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

స్ఫూర్తి ప్రదాత వైఎస్సార్

స్టేషన్ మహబూబ్‌నగర్/ సాక్షి నెట్‌వర్క్ : దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వైఎస్సార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్, ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, ప్రదీప్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు బెక్కరి అనిత, లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్‌ఖాద్రీ, రాఘవేంద్రరాజు, రాములుయాదవ్, అజ్మత్‌అలీ, అవేజ్, సరోజ్ పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో నివాళి అర్పిస్తున్న జి.మధుసూదన్‌రెడ్డి, ఒబేదుల్లా కొత్వాల్ ఇతర కాంగ్రెస్ నాయకులు

- దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి స్ఫూర్తి ప్రదాత అని డీసీసీ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీపీ నిత్యానందం అన్నారు. శనివారం వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని జడ్చర్ల క్రాస్‌రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. నాయకులు ఆనంద్, యాదయ్య, స్వప్న, లక్ష్మమ్మ, అరవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.
- గండేడ్‌లో కాంగ్రెస్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ జితేందర్‌రెడ్డి, వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి, నాయకులు ర్యాగరి శ్రీనివాస్‌రెడ్డి, పులిందర్‌రెడ్డి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.
- అడ్డాకులలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి నిర్వహించారు. విజయమోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు, సయ్యద్‌షఫి, నిరంజన్, బుచ్చన్నగౌడ్, నవీన్, రాములు తదితరులు ఉన్నారు.
- రాజాపూర్ మండలంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణయ్య, చంద్రకాంత్‌గౌడ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. హన్వాడలో మండల కాంగ్రెస్ సీనియర్ నేత యాదవరెడ్డి, నాయకులు వెంకటయ్య, కృష్ణయ్య యాదవ్, శ్రీశైలంయాదవ్, వెంకటమ్మ, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేట మండలంలో నిర్వహించిన వేడుకల్లో నాయకుడు ఖాజా, ఎంపీటీసీ తులసీరాంనాయక్, రాజేష్, రాంచంద్రయ్య, రమేష్‌గౌడ్, శ్రీహరి, నర్సింహ, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. మహమ్మదాబాద్‌లో మండల పరిధిలో వైఎస్సార్‌కు ఘనంగా నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య, అంజిలయ్య, నర్సింలు, భీమయ్య, బాల్‌చందర్, తదితరులు పాల్గొన్నారు.
- మిడ్జిల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో

స్టేషన్ మహబూబ్‌నగర్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ తెలంగాణ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వైఎస్ సేవలు మరువలేనివన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ వాజిద్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు అయ్యప్ప నాయకులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండలంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు మహేందర్ నాయకులు వడ్డె కృష్ణయ్య, లక్ష్మణ్, రాజు, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



మహమ్మదాబాద్‌లో మండలం గాధిర్యాల్‌లో..



నవాబుపేట మండలం కొల్లూర్‌లో..



హన్వాడలో..



రాజాపూర్‌లో ..



మిడ్జిల్‌లో..



అడ్డాకులలో..



గండేడ్‌లో..



జడ్చర్లలో..

జీనుగతో పంటల దిగుబడి పెరుగుతుంది



రుద్రారంలో జీనుగపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

నవాబుపేట: జీనుగ పంటతో ఇతర పంటల దిగుబడి చాలా పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. రైతులు జీనుగ వేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం జీనుగ పంటలను ఏఈఓలతో కలిసి పరిశీలించారు. జీనుగ వేస్తే రసాయన ఎరువుల వాడకం సైతం లేకుండా పంటలు సాగుచేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఏఈఓలు తేజస్విని, కృష్ణగౌడ్ ఉన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే..

బాలానగర్: మూడు రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. దీంతో కొందరు స్థానికులు గతంలో మాదిరిగానే రోడ్లపై, ఖాళీప్రదేశాల్లో చెత్త వేస్తున్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సంతతో రోడ్లపై పడిన చెత్త, కూరగాయల వ్యర్థాలు ఎక్కడికక్కడే ఉండిపోయాయి. తొలగించక పోవడంతో దుర్వాసన వస్తోందని, వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమ్మె ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



నేటి నుంచి ప్రజాహిత పాదయాత్ర



మాట్లాడుతున్న దుశ్యంత్‌రెడ్డి

నవాబుపేట: పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి ఆదివారం నుంచి ప్రజాహిత పాదయాత్ర ప్రారంభించనున్నారు. పర్వతాపూర్ మైసమ్మ ఆలయం వద్ద నుంచి కార్యక్రమం ప్రారంభం కానుంది. జడ్చర్ల నియోజకవర్గం మొత్తం పాదయాత్ర సాగనుండగా నవాబుపేట మండలం నుంచి అంకురార్పణ చేశారు. మండలం మొత్తం 25గ్రామాల మీదుగా దాదాపుగా వారం రోజులు జరిగే యాత్రలో మొత్తం 65 కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే యాత్ర

ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి పరిష్కారం చూపేందుకే పాదయాత్ర మండలంలో చేపట్టనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన కాంగ్రెస్ ముఖ్య కార్యాకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలం నుంచి 6 వందల మందికి పైగా యువకులు పాల్గొంటారని వివరించారు. రాష్ట్ర నాయకులు సైతం రానున్నట్లు వివరించారు. మైసమ్మ ఆలయం వద్ద ప్రారంభం కానున్న యాత్రలో కేరళ కళాకారులు విన్యాసాలు ఉంటాయన్నారు. ఎంపీటీసీ తులసీరాంనాయక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాసుయాదవ్ పాల్గొన్నారు.

ఎస్‌వీకేఎంలో మాదిరి పోలింగ్



ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థులు

జడ్చర్ల /రాజాపూర్: మండల పరిధిలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న ఎస్‌వీకేఎంలో శనివారం విద్యార్థులకు ఎన్నికల పోలింగ్, బ్యాలెట్ నిర్వహణ, ఓటు వేసే విధానం, ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు మాదిరి పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. విద్యార్థులు క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కార్యక్రమానికి అసోసియేట్ డీన్ స్కూల్ ఆఫ్‌లా ప్రొఫెసర్ మహ్మద్ అరబ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డాక్టర్ ఎబినేజర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన పద్యనాటకోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ టౌన్‌హాల్‌లో పాలమూరు ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న పద్యనాటకోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పలు పౌరాణిక నాటక ప్రదర్శనలు చేశారు. పాత్రధారులు తమ అభినయంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాలమూరు ఆర్ట్స్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల అందజేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వార్డు నం.45లోని టీడీగుట్ట, వార్డు నం.29లోని కుమ్మరివాడి తదితర ప్రాంతాల్లో శనివారం రెడ్యూస్–రీయూజ్–రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) పై ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. కాగా వారికి దాతలు రెండు చీరలు, ఆరు పాత నోట్‌బుక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఆర్‌ఆర్ సూపర్‌వైజర్ మహేందర్, ఆర్‌పీలు రజిత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

బాలానగర్: రైతుబంధు కోసం దరఖాస్తులు చేసుకోవడానికి ఈ నెల 7 వరకు ఉన్న గడువును మరో మారు ప్రభుత్వం పొడిగించింది. 10 వరకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాదయాత్ర విజయవంతం చేయండి

మిడ్జిల్: ప్రజల సమస్యలపై ఆదివారం నవాబ్‌పేట్ మండల పరిధిలోని ఫతేపూర్ మైసమ్మ ఆలయం నుంచి టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి చేస్తున్న ప్రజాహిత పాదయాత్రలో మిడ్జిల్ మండలం నుంచి అధికసంఖ్యలో నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ సూచించారు. సమస్యలపై పోరాటం చేస్తున్న అనిరుధ్‌రెడ్డికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు.

వేధిస్తున్న కుక్కల బెడద

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌లో స్థానికులు, గొర్రె పిల్లలు, కోళ్ల తదితరాలపై కుక్కలు దాడి చేస్తున్నాయని గ్రామస్తులు మల్లికార్జున్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మోహన్ శనివారం అన్నారు. ఇప్పటికే ఎంపీడీఓకు విన్నవించినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీజేవైఎం జిల్లా కార్యదర్శి సాయికుమార్, తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. శనివారం హైదరాబాద్‌లోని మంత్రి శ్రీనివాస్ గౌడ్ నివాసంలో కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్మన్ నర్సిములు, రామకృష్ణ, రామలింగం, పవన్‌కుమార్, బలరాం పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



మహబూబ్‌నగర్ రూరల్: ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కోటకదిర సింగిల్‌విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు శనివారం మాచన్‌పల్లి ఇంటింటా సర్వే కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శివకుమార్, నాయకులు యాట కృష్ణయ్య, మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, మొగులయ్య, నారాయణ, నరేష్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మకు ప్రత్యేకపూజలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి శనివారం శ్రీవేంకటేశ్వర మహిళా సత్సంగ్ మండలిచే స్థానిక శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయానికి బోనం, సారే తీసుకువెళ్లారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మమ్మ, అర్చకులు రవి, చంద్రకళారెడ్డి, టీటీడీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి, సురేష్‌చంద్ దూత్, గుబ్బ వెంకటేశ్వర్లు, తారకం, హన్మంతురెడ్డి, రవీందర్‌రెడ్డితోపాటు ఏనుగొండ ఆంజనేయస్వామి ఆలయ భజన బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి టాపర్లకు బహుమతులు



మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీలో పదోతరగతిలో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. శనివారం కాంగ్రెస్ మైనార్టీ సేల్ అధ్యక్షుడు ఉస్మాన్ నగదు పురస్కారాలు అందించారు. ఏటా అందిస్తామని వివరించారు. మిడ్జిల్ ఎంపీటీసీ ఎండీగౌస్, సంపత్, సత్యం, కృష్ణ, శివ, పర్వతాలు పాల్గొన్నారు.

స్వీపర్లను రెగ్యులర్ చేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లా వ్యాప్తంగా జెడ్పీ, మండల పరిషత్ స్కూళ్లలో పనిచేస్తున్న స్వీపర్లను రెగ్యులర్ చేసేదాక పోరాటం చేస్తామని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ధర్నాచౌక్‌లో స్వీపర్లు చేస్తున్న రిలేదీక్షలు శనివారం 13వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. 20న కొల్లాపూర్ సభలో స్వీపర్ల సమస్యలను రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కొంతమందికి రూ.1623, మరి కొందరికి రూ. 4వేలు వేతనాలు ఇస్తూ స్వీపర్లలో ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. అన్ని స్కూళ్లలో స్వీపర్ల నియమకం చేపట్టాలని అన్నారు. టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, స్కూల్ స్వీపర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, జైపాల్, నాయకులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో షాదీఖానా నిర్మాణం కోసం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రూ.కోటి మంజూరు చేయడం హర్షనీయమని పలువురు ముస్లిం సంఘాల ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాలిబ్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడారు. జిల్లా కేంద్రంలో సామాజిక వర్గాల అభివృద్ధితోపాటు అన్ని వర్గాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ముస్లింల సంస్కృతిని ప్రతిబింబించే భవన నిర్మాణాలను చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. షాదీఖానాను ఈద్గా స్థలంలో కాకుండా ముస్లింలకు అందుబాటులో ఉండే ఉర్దూ ఘర్ స్థలంలో నిర్మించాలని, మహబూబ్‌నగర్ స్థాపకుడు మీర్ మహబూబ్‌అలీ స్మారక మందిరాన్ని నిర్మించాలని కోరారు. త్వరలో మంత్రి దృష్టికి తీసుకెళతామని అన్నారు. ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, మదీనా మజీద్ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు అవద్‌బిన్ సయీద్, బైతుల్‌ఖైర్ ప్రతినిధి తఖీ, బీఆర్‌ఎస్ నాయకుడు మోసీన్‌ఖాన్, షోయబ్‌అలీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఫారుఖ్ హుస్సేన్

హామీలు నెరవేర్చని కేంద్ర ప్రభుత్వం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: బయ్యారం స్టీల్ ప్లాంట్, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా వంటి విభజన హామీలను నెరవేర్చకుండా తెలంగాణకు ప్రధాని నరేంద్రమోదీ ఏం మొహం పెట్టుకుని వస్తారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్ మండిపడ్డారు. శనివారం పట్టణంలో తెలంగాణ చౌరస్తా వరకు మోదీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా విభజన హామీలను నెరవేర్చకపోవడం సరికాదన్నారు. పేదలు కూరగాయలు కొనలేని స్థితిలో ధరలు పెరిగాయని, కార్పొరేట్లకు మాత్రం ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని ఆరోపించారు. జిల్లా నాయకులు అల్వాల్‌రెడ్డి, బీఆర్ విల్సన్, చాంద్‌బాష, సంతోష్, యువరాజ్, రమేశ్, రామకృష్ణ, గూడుపాష, మోహన్ పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో మాట్లాడుతున్న నాయకులు

పర్మినెంట్ చేసేవరకు పోరాటం

జడ్చర్ల/సాక్షి నెట్‌వర్క్: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రాములు డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం మూడవ రోజుకు చేరుకున్న సందర్భంగా పాల్గొని మాట్లాడారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య ,ఏఐటీయూసీ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- మిడ్జిల్ మండల కేంద్రంలో కార్మికుల జేఏసీ జిల్లా చైర్మన్ నల్లవెల్లి కురుమూర్తి, మండల అధ్యక్షుడు యాదయ్య, నారస్‌రెడ్డి, వెంకటయ్య ,అచ్చలయ్య తదితరులు పాల్గొన్నారు.
- హన్వాడ మండలకేంద్రంలో మొత్తం 35పంచాయతీల కార్మికులు శనివారం సమ్మెలో కూర్చున్నారు. ప్రధానరహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్, మండల పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు బాలకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో జిల్లా ఇఫ్టూ కార్యదర్శి సాంబశివుడు, మండల కార్యదర్శి వెంకట్‌రాములు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

- గండేడ్‌లో మండల కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జితేందర్‌రెడ్డి, మండల లీగల్ సెల్ అడ్వైజర్ పుల్లారెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, బసప్ప, పులిందర్‌రెడ్డి , చెంచు అంజిలయ్య పాల్గొన్నారు.



జడ్చర్లలో సమ్మె చేస్తున్న కార్మికులు

- అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో శనివారం గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగింది. సీఐటీయూ నాయకుడు కురుమూర్తి, ఏఐటీయూసీ నాయకుడు రామ్మోహన్ సంఘీభావం తెలిపి మాట్లాడారు.